"ఏ దేశమేగినా ఎందుకాలిడినా భారతీయులు క్రమశిక్షణకు తామిచ్చే నిర్వచనం మార్చుకోలేరు"

# ముప్ఫై నాలుగు నిముషాలు

సోమరాజు గారంటే ఆ ఆఫీసులో అందరికీ హడల్. ఆయనకు ఎప్పుడు కోపం వస్తుందో ఎవరికీ తెలియదు. ఆయన నవ్వుతూ మాట్లాడుతూ హఠాత్తుగా కోపం తెచ్చేసుకుంటాడు. కోపం వచ్చినప్పుడు ఆయన నోటికి హద్దులుండవు.

సోమరాజుగారు ఎవరో అయితే నాకే బాధా ఉండేది కాదు. ఆయన నాకూ, నాబోటి మరో యాభైమంది దురదృష్టవంతులకూ పై అధికారి.

ఆయనకు పెద్దా, చిన్నా, పేదా, గొప్పా వగైరా పట్టింపులన్నీ ఉన్నాయి. అలాటి పట్టింపులుండకూడదని చాలా ఎక్కువగా ఉపన్యాసాలిచ్చే అలవాటు కూడా ఉంది. అంతమాత్రాన సోమరాజుగారు చెప్పేదొకటి చేసేదొకటీ అనుకునేందుకు వీలులేదు. తను చెప్పినదానికి వ్యతిరేకంగా ప్రవర్తిస్తున్నట్లు ఎన్నడూ ఆయన భావించలేదు.

సోమరాజుగారాఫీసులో అడుగు పెట్టగానే మేమంతా లేచి నిలబడాలి. అది ఆయన జులుంగా మేము భావించరాదు. క్రమశిక్షణకు సంబంధించిన విషయమది. ఎప్పుడైనా ఆయన్ను చూసి లేచి నిలబడడం మరిచి పోతే ఆయన పెద్ద ఉపన్యాసం ఇచ్చేస్తాడు. తనూ అందరూ సమానమేనట. తను అందరి కంటే గొప్పవాడినని అనుకోవడం లేదుట. తనను చూసి లేచి నిలబడకపోతే అందులో అగౌరవం లేదుట. క్రమశిక్షణ పాటించడమొక్కటే తన జీవితాశయమట. ఆ ఉపన్యాసంలో ఆయన గొంతు గద్గదికమవుతుంది. కళ్ళు చెమ్మగిల్లుతాయి. క్రమశిక్షణపైనా, ఆయనపైనా గౌరవమున్నా లేకపోయినా మళ్ళీ అలాంటి ఉపన్యాసం వినాలన్న భయమే మమ్మల్ని, ఆయన్ని చూడగానే లేచి నిలబడేలా చేస్తుంది.

మేము పాటించవలసిన క్రమశిక్షణ ఒక్క ఆఫీసులో మాత్రమే కాదు. బజార్లలోనూ, సినిమాహాళ్ళలోనూ, వగైరాల్లోనూ ఆయన ఎక్కడ కనపడ్డా మేమాయనకు దణ్ణం పెట్టి వినయంగా పక్కకు తప్పుకోవాలి. ఇది మా ఒక్కరికే పరిమితం కాలేదు. నన్ను పెళ్ళాడిన

తప్పుకు నా భార్యకు, మాకు పుట్టిన పాపానికి మా పిల్లలకు కూడా తప్పదిది. ఎప్పుడో ఓ రోజున బజార్లో ఓ ఉద్యోగి కొడుకు ఆయనకు నమస్కరించలేదుట. మర్నాడు ఆఫీసులో మేమంతా చచ్చినట్లు ఆయన ఉపన్యాసాన్ని వినాల్సొచ్చింది.

అయితే ఈ విషయాన్ని కూడా సోమరాజుగారు జులుంగా భావించడు. ఆయన మాకు అన్నలాంటి వాడట. తండ్రి వంటి వాడిననడు. మాలో ఎవ్వరూ మరీ అంత చిన్నవాళ్ళు కారు కాబట్టి తను ముసలివాడిననిపించుకోడం ఇష్టంలేక ఆయన అన్నలాంటి వాడిననే అంటాడు. పెద్దవాళ్ళని గౌరవించడం ప్రతి ఒక్కడూ తను నేర్చుకుని తన కుటుంబానికి నేర్పాలట!

ఆఫీసులో పని మరీ ఎక్కువుండదు. జీతాలు బాగా వస్తాయి. సెంట్రల్ గవర్నమెంట్ సర్వీస్. సోమరాజుగారి బెడద తప్పితే అంతా బాగానే ఉందక్కడ. అందుకే మేమంతా ఆఫీసు వదిలిపెట్టాలనుకునే బదులు సోమరాజుగారికి బదిలీ అయిపోతే బాగుండునని కోరుకుంటూంటాం.

కొంతకాలానికి మా కోరిక సగం ఫలించింది. సోమరాజుగారికి బదిలీ కాక పోయినా ఫారిన్ ఛాన్సు వచ్చింది. ఆరు నెలలు అమెరికా వెళ్ళి కొన్ని విషయాలనాయన పరిశీలించి ఆ పద్ధతులను ఇండియాలో అమలు చేయవలసి ఉంది.

ఆరు నెలలపాటు మాకు ఆటవిడుపే అయింది. ఆఫీసు జీవితం స్వర్గంలా అనిపించేది. ఉత్సాహంగా ఆఫీసుకు వెళ్ళి దిగాలుగా ఇంటికి వెళ్ళే పరిస్థితి కూడా ఏర్పడి ఇంట్లో శ్రీమతి చేత చీవాట్లు కూడా తిన్న అనుభవాలు నాతో పాటు చాలా మందికి జరిగాయి.

ఆరు నెలలు కాగానే మాస్వేచ్ఛా జీవితానికి ఫుల్‌స్టాపు పెడుతూ సోమరాజుగారు అమెరికా నుండి తిరిగివచ్చాడు. తిరిగి వచ్చినరోజున మమ్మల్నందర్నీ ఎంతో అభిమానంతో అప్యాయంగా పలకరించాడు. ఆయన్నూ, ఆయన మాట్లాడే తీరునూ, ఆయన ప్రవర్తననూ చూస్తుంటే ఆయనలో చాలా మార్పు వచ్చినట్లు తోచింది.

వచ్చిన మర్నాడు ఆయన పెద్ద మీటింగు ఏర్పాటు చేసి తన ఫారిన్ అనుభవాలన్నీ వివరించి చెప్పాడు.

"ఫారిన్లో మనం నేర్చుకోవాలసిన విషయాలు చాలా ఉన్నాయి. అన్ని విషయాల్లోనూ ముందున్నట్లు వారి ప్రవర్తనలో కూడా ఎన్నో గొప్ప అంశాలున్నాయి. వాటిలో చెప్పుకోదగ్గ విశేషం ఎవరి పని వారు చేసుకోవడం. అక్కడ ప్యూన్ ఉద్యోగాలనేవి లేనేలేవు. ఎవరిళ్ళలోనూ పనివాళ్ళుండనే ఉండరు. ఒక పర్యాయం నేనో ఆఫీసుకు వెళ్ళాను. అక్కడ ప్రధానాధికారి నాకేదో ఫైలు చూపిస్తున్నాడు. చటుక్కున ఆయన చేతిలోంచి ఫైలు జారిపోయింది. అందులోని కాగితాలన్నీ చెల్లాచెదురుగా కిందపడ్డాయి. అప్పుడేం జరిగిందో తెలుసా?" అనిసోమరాజుగారో క్షణం ఆగాడు, అప్పుడాయన కళ్ళు మెరుస్తున్నాయి. ఆ అనుభవపు స్ఫురణకలిగించిన పారవశ్యం ఆయన ముఖంలో కనపడుతోంది. "మనకులా ఆ అధికారి ప్యూన్...... ప్యూన్ అంటూ కేకలు పెట్టలేదు.

తనే స్వయంగా వంగుని ఆ కాగితాలన్నీ జాగ్రత్తగా ఏరి మళ్ళీ ఫైల్లో పెట్టుకున్నాడు" అని ఆయన ఇంకా ఏదో చెప్పబోతూండగా ఆయన చేయి తగిలి బల్లమీద పెట్టిన పింగాణి ఫ్లవర్‌వాజ్ కిందపడి ముక్కలయింది. వెంటనే మాలో చాలామంది లేచి ముందుడగు వేశాం. సోమరాజు గారు అందర్నీ వారించి "ఇది నా వల్ల జరిగిన పొరపాటు. ఇందులో మీరు కానీ, ప్యూన్ కానీ కలగజేసుకోవడానికి వీల్లేదు" అంటూ ఓ కాగితం తీసుకుని అందులోకి పగిలిన ముక్కలన్నీ జాగ్రత్తగా ఏరి చెత్త బుట్టలో పారేశాడు. అపురూపమైన ఈ సన్నివేశం చూసిన సమయం ఖచ్చితంగా తెలుసుకోవడం కోసం నేను వాచీ చూశాను. టైము పదకొండూ ఇరవై రెండయింది.

ఆ తర్వాత సోమరాజుగారు తన ఉపన్యాసాన్ని మరో అర్థగంట సేపు కొనసాగించాడు. తను చూసినవీ, తెలుసుకున్నవీ ఆచరణలో కూడా పెట్టగలడనీ అంతా అనుకునేటందుకు వీలుగా తనకు అవకాశం వచ్చినందుకు కలిగిన ఆనందం ఆ ఉపన్యాసం ఇస్తున్నంతసేపూ ఆయన ముఖంలో కనపడుతూనే ఉంది.

సోమరాజుగారిలో మార్పు వచ్చిందనీ, ఆయన అజమాయిషీలో ఇక మీదట మేమంతా సుఖపడగలమనీ, ఆయన ఉన్నప్పటికీకూడా ఆఫీసు మాకు స్వర్గం కాగలదనీ ఆయన ఉపన్యాసం వింటున్నంతసేపూ మాకు అనిపించింది.

సోమరాజుగారు ఉపన్యాసం ముగించి అయాసంగా కుర్చీలో చతికిలపడ్డారు. మేమంతా చప్పట్లు కొట్టాము.

అప్పుడే ప్యూన్ ఒక గ్లాసుతో మంచినీళ్ళు తెచ్చి ఆయనకు అందించాడు. సోమరాజుగారవి గటగటా తాగేసి "ఇంకో గ్లాసు" అన్నాడు. తీసుకురావడానికి ప్యూన్ వెళ్ళిపోయాడు.

అప్రయత్నంగా నేను టైం చూశాను. నా వాచీలో టైము పదకొండూ యాభై అరయింది. పగిలిన పింగాణీ ముక్కలు ఏరడానికి మేము వస్తే వారించి సోమరాజుగారు తనే స్వయంగా ఏరిన దృశ్యానికీ, ప్యూన్ మంచినీళ్ళు తెస్తే మామూలుగా అందుకుని ఇంకో గ్లాసు కావాలని ఆయన అడిగిన దృశ్యానికీ మధ్య గడిచిన సమయం కేవలం ముప్ఫై నాలుగు నిముషాలు మాత్రం!

ఆ తర్వాత గంటలు,దినాలు, రోజులు గడిచాయి.

సోమరాజుగారిప్పుడు తను అమెరికా పద్ధతులనమల్లో పెడుతున్నాననీ తన ప్రవర్తన మారిపోయిందనీ అనుకుంటున్నాడు. అయితే మా జీవితాలలో మాత్రం ఏ విధమైన మార్పూ లేదు. ఎందుకంటే ఎన్ని దేశాలు తిరిగినా సోమరాజుగారు క్రమశిక్షణను పాటించే గుణాన్ని మాత్రం వదులుకోలేకపోతున్నాడు.

◆ ◆ ◆